క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



కర్లపాలెం: కంటి వ్యాధులకు సకాలంలో వైద్యం చేయించుకోవాలని రేపల్లె ఫోకస్ కంటి హాస్పిటల్ నేత్ర వైద్యుడు కిషోర్ చెప్పారు. రెడ్డి సేవా మిత్ర ట్రస్ట్ అధ్యక్షుడు నంగు గోవర్ధన రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పాతనందాయపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వంద మందికి కిషోర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన నాగిరెడ్డి సహకారంతో శిబిరం నిర్వహించామని గోవర్ధనరెడ్డి చెప్పారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందిస్తామని తెలిపారు. కంటి శుక్లాల ఆపరేషన్ కూడా ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. కుంచాల నాగిరెడ్డి, అక్కల రమణారెడ్డి, రావి గోవిందరెడ్డి, గోపిరెడ్డి, రామచంద్రారెడ్డి, గంగాధర్‌రెడ్డి, సుధాకుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు నగదు బహుమతులు



ప్రత్తిపాడు: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ పత్తిపాడు మాజీ ప్రెసిడెంట్ పచ్చల శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన తమలపాకు శ్రీజ, షేక్ షాజియా, కొత్తపల్లి శ్రీలక్ష్మిలకు శనివారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పచ్చల సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పచ్చల శ్రీనివాసరావు విద్యార్థులకు నగదు బహుమతులను హెచ్ఎం చేతుల మీదుగా అందించారు. హెచ్ఎం సునీతలత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి

ప్రత్తిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రావూరు పరమేశ్వరరావు, గోరంట్ల రత్తయ్య, మందలపు సాయిబాబులు తమ గేదెలను మేత కోసం శుక్రవారం బయటకు వదిలారు. అయితే ఎప్పటిలా గేదెలు రాత్రి ఇంటికి రాలేదు. శనివారం ఉదయం గుంటూరు – పర్చూరు పాతమద్రాసు రోడ్డుపై కోయవారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు సమీపంలో మృతి చెంది పడి ఉన్నాయి. విషయం తెలుసుకున్న పశుపోషకులు ఘటనా స్థలానికి చేరుకుని గేదెలు తమవేనని నిర్ధారించుకున్నారు. అనంతరం విషయం వీఆర్వో రాణికు తెలియడంతో ఆమె గేదెల యజమానుల నుంచి వివరాలను సేకరించి, స్టేట్ మెంట్ తీసుకున్నారు. మృతి చెందిన గేదెల్లో రెండు పాలు ఇచ్చే గేదెలు కాగా, ఒకటి చూడి గేదె అని పోషకులు చెబుతున్నారు. రెండు మూడు రోజుల్లో గేదె ఈననున్నదని ఈ లోపే ఇలా జరిగిందని వాపోతున్నారు. ఒక్కో గేదె విలువ రూ.లక్ష నుంచి లక్షన్నర వరకూ ఉంటుందని చెప్పారు.

జీవో నెంబర్ 5ను రద్దు చేయాలి



తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల కోసం జారీ చేసిన జీవో నెంబర్ 5 ను రద్దు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు శనివారం తెనాలిలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. అలాగే సబ్ కలెక్టర్ సంజన సింహాకు కూడా వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

జనరల్ సర్జరీ విభాగాధిపతిగా డాక్టర్ కిరణ్‌కుమార్



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగాధిపతిగా డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ శనివారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్ సర్జరీ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ జి.పద్మశ్రీ సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ రంగనాయక మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో సర్జరీ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరోగ్య యోగం.. ఆనంద భాగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం పలు ప్రాంతాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు జరిగాయి. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రజలు ఉత్సాహంగా ఆయా కార్యక్రమాలలో పాల్గొన్నారు. యోగాసనాలు వేశారు. పలువురు ప్రముఖులు కూడా పాల్గొని, దైనందిన జీవితంలో యోగాను అందరూ సాధన చేయాలని సూచించారు.



రేపల్లె: యోగా సాధనలో ఆర్డీవో నేలపు రామలక్ష్మి, ప్రజలు, విద్యార్థులు

రేపల్లె: యోగాతో మానసిక ప్రశాంతత, మేధాశక్తి పెరుగుతుందని ఐఆర్ఈఎఫ్ విద్యాసంస్థల డిప్యూటీ డైరెక్టర్ రెబ్బ జాన్ చెప్పారు. రేపల్లె క్రైస్తవ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నిత్యం యోగా చేయాలన్నారు. ఈ సందర్భంగా యోగాసనాలు వేశారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ అమర్తలూరు (వేమూరు): యోగా సాధనతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మెరుగు పడతాయని గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. అమర్తలూరు మండలంలోని గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం జరిగింది. ఇందులో సర్పంచ్‌తోపాటు యోగా నిపుణుడు తుమాటి శేషయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.శివశంకరావు, ఉప్పల సాంబశివరావు, పావులూరు బసవయ్య చౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ వేమూరు: యోగా ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఎంపీడీవో పి.రవి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ పుర వేదిక వద్ద ఉద్యోగులు వేడుకలో పాల్గొన్నారు. యోగా సాధన చేశారు.

■ రేపల్లె: యోగా సంపూర్ణ ఆరోగ్య సంజీవని అని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం యోగా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా యోగాసనాలు వేశారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

■ భట్టిప్రోలు (కొల్లూరు): మండలంలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. భట్టిప్రోలు టీఎంరావు పాఠశాల విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. రెవెన్యూ, మండల పరిషత్తు కార్యాలయ సిబ్బంది కూడా యోగా సాధన చేశారు.



వేమూరు: ఎన్టీఆర్ పుర వేదిక వద్ద..

■ కొల్లూరు: ఆరోగ్యవంతమైన జీవనం సాగించడానికి యోగా మేలు చేస్తుందని తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో సాయి వాసవి పాఠశాల విద్యార్థులతో పాటు అధికారులు యోగాసనాలు వేశారు. ఇందులో తహసీల్దారు మాట్లాడుతూ నిత్యం యోగా సాధన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

■ అమర్తలూరు(వేమూరు): యోగా వల్ల ఆరోగ్యం మెరుగు అవుతుందని ఎంపీడీవో మారుతీ శేషాంబ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కూచిపూడిలో మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ కె.శ్యామల, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ కర్లపాలెం: యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తాయని యాజలి సర్పంచ్ నాదెండ్ల భానుప్రసాద్, కర్లపాలెం సర్పంచ్ లలితకుమారి, ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, దమ్మనవారిపాలెం సర్పంచ్ గురపసాల వెంకటేశ్వరమ్మలు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం, స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఆయా గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులతో కలిసి యోగాసనాలు చేశారు. ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శులు సునీత, వీరాస్వామిరెడ్డి, మురళి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతకు అండగా వైఎస్సార్‌సీపీ



బాపట్ల: యువతకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని ఆ పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య పేర్కొన్నారు. యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేరుగ చంద్‌నాగ్ బాపట్లకు విచ్చేసిన సందర్భంగా శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. యువతీయువకులకు అండగా వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, నాయకులు జయభారత్ రెడ్డి, నక్కా వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీన ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.శివపార్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

విత్తన ఎంపిక ప్రధానం

ఏవో శ్రీనివాస్‌రెడ్డి



కొల్లిపరలో వరి విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కొల్లిపర: తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయి. గ్రామాలల్లో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. దీంతో శనివారం మండల వ్యవయాధికారి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని తూములూరు, కొల్లిపర, వల్లభాపురం, మున్నంగి, అత్తోట తదితర గ్రామాలలోని వరి విత్తనాలు అమ్మే దుకాలు సిబ్బందితో కలసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి విత్తన డీలర్లకు, వరి విత్తనాలు కొనేందుకు సిద్ధమవుతున్న రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. రైతులు విత్తన ఎంపిక ప్రధానమని, నాణ్యమైన విత్తనాలతోనే చీడ పీడలు ఆశించకుండా అధిక లాభాలు సాధ్యమని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఎరువులు, విత్తనాలు అమ్ముతున్నట్లు రైతులు దృష్టికి వస్తే వెంటనే వ్యవసాయాధికారులకు తెలియజేయాలి అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ప్రధానంగా విత్తన ఎంపిక, కొనుగోలు సమయంలో రైతులు కింద తెలిపిన సూచనలు తప్పకుండా పాటించాలని తెలిపారు.

లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. రశీదు తీసుకోవాలి, రసీదు మీద ప్యాకెట్, ల్యాట్ నంబర్ ఉన్నదీ, లేనిదీ చూసుకోవాలి.

- సాగు చేసే ముందు విత్తనాలను విత్తనశుద్ధి చేయాలని, దీనివల్ల తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చు.
- విత్తనాలు కొనుగోలు చేశాక మొలక శాతం పరీక్షించాలి. మొలక శాతం 80 శాతం ఉండాలి.
- పొలంలో విత్తనాలు వేసిన నాటి నుంచి పంట ఇంటికి వచ్చే వరకు విత్తనాలకు సంబందించిన రశీదులు దగ్గర ఉంచుకోవాలి. రైతుకు ఏదైనా నష్టం జరిగితే అవి ఉపయోగపతాయి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయరాదు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్ , సీసా, డబ్బాలపై సీల్ ఉందా? కాలం చెల్లుబాటు ఉండా ? లేదా ? అన్నది నిర్ధారించుకోవాలి
- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో ఎటువంటి లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

పొన్నూరు: నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్లో శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సభకు ఎంఈఓ–2 కె. విజయభాస్కర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 చలపతిరావు, హెచ్ఎంలు శివలక్ష్మి, వైఎస్‌టీ సాయి, జయరాజు, అనురాధ, మహబూబ్ బాషా, నిర్మల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అయితే పాఠశాలలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇంకా మండలంలో పూర్తిస్థాయిలో విద్యార్థులకు పుస్తకాలు అందజేయక పోవడంపై తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రత్తిపాడు: మండల పరిధిలోని చినకోండ్రుపాడు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. దాత గడ్డిపాటి పద్మజారాణి సహకారంతో పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లావు సాంబశివరావు, గ్రామస్తుడు పోతురాజు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు కోసం.. గిరిజన పిల్లలకు కష్టాలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర ప్రభుత్వం గొప్పల కోసం, ప్రధాని మెప్పు కోసం, మరీ ముఖ్యంగా గిన్నిస్ రికార్డు కోసం వేల మంది గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేశారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మండిపడ్డారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల నుంచి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టల్స్ నుంచి యోగాంధ్ర కార్యక్రమానికి అర్ధరాత్రి 2 గంటలకు బస్సులో తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, అజయ్, వెంకీ, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

నెహ్రూనగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్వామా పీడీ వి.శంకర్, హౌసింగ్ పీడీ ప్రసాద్, గుంటూరు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్యామల, డ్వామా సిబ్బందితో కలిసి డ్వామా కార్యాలయం ముందు మొక్కలు నాటారు.

కూటమి మోసాలపై 'యువత పోరు'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్ తదితరులు

- ఈ నెల 23న బాపట్ల కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమానికి భారీగా తరలిరావాలి
- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పిలుపు

రేపల్లె: కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసగించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన బాపట్ల కలెక్టరేట్ వద్ద జరగబోయే యువత పోరును జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పిలుపునిచ్చారు. గుళ్ళపల్లిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రజానీకానికి చేసింది ఏమీ లేదన్నారు. అన్ని వర్గాలను తీవ్రంగా మోసం చేసిందని దుయ్యబట్టారు. ముఖ్యంగా యువతను నట్టేట ముంచిందని పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, లేదంటే అప్పటివరకు నిరుద్యోగ భృతి నెలకు రూ. 3 వేలు చొప్పున ఇస్తామని నమ్మబలికిందన్నారు. తద్వారా ఓట్లు దండుకుందన్నారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ మోసాలను వైఎస్సార్‌సీపీ నిరంతరం ఎండగడుతుందని చెప్పారు.

పెద్దఎత్తున తరలిరావాలి

యువత పోరులో భాగంగా బాపట్లలోని పార్టీ జిల్లా కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు జరిగే నిరసన ర్యాలీలో యువకులు, నిరుద్యోగులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి, రేపల్లె నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు దొంతిబొయిన కొండల రెడ్డి, నగరం మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ, బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నిజాంపట్నం కోటేశ్వరావు, నిజాంపట్నం యూత్ అధ్యక్షుడు వల్లూరి వెంకట రవి, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షుడు శ్రీనివాసరావు, టీచర్ల విభాగ అధ్యక్షుడు ఏసుపాదం, జిల్లా యువజన విభాగ కార్యవర్గ సభ్యుడు రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రావినూతల శ్రీరామమూర్తి జయంతి



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురుకు చెందిన ప్రముఖ కవి, రచయిత, నటుడు రావినూతల శ్రీరామమూర్తి 74వ జయంతిని శనివారం ఇక్కడి తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద కళాకారులకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సభకు రంగస్థల కళాకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. తెనాలికి తొలి నంది బహుమతిని తీసుకొచ్చిన దర్శకుడు శ్రీరామమూర్తి అని ఆయన గుర్తుచేశారు. తెనాలి మాజీ జడ్పీటీసీ శాఖమూరి నారాయణప్రసాద్ (చిన్నా), గణేష్ యూత్ వీరవల్లి మురళి, డాక్టర్ కడియాల వెంకటరమణ తమ ప్రసంగంలో శ్రీరామమూర్తి వ్యక్తిత్వాన్ని, గుణగణాలను కొనియాడారు. అంగలకుదురు గ్రామ ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, ఫౌండేషన్ సభ్యులు ప్రకాష్, అన్నపూర్ణ, అనిరుధ్, శివప్రసాద్, రాజేష్‌చౌదరి, కనపర్తి మధుకర్, కళాకారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, సర్పంచ్ పవన్‌కుమార్

తెనాలిటౌన్: భూగర్భ జలాల సంరక్షణకు వర్షపు నీటిని ఒడిసి పట్టాల్సిన అవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ ఎంపీడీవో వైవిడి ప్రసాద్ సూచించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో శనివారం స్వచ్ఛంధ్ర – స్వర్ణంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్ పాల్గొని నీరు–మీరు ఆవశ్యకతను గ్రామస్తులకు తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతినెల మూడోవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా శనివారం నీరు–మీరు ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పంచాయతీ కార్యాలయం పరిసరాలలో ఇంకుడు గుంతులు ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇంకుడుగుంత ఏర్పాటుకు ప్రభుత్వం లబ్ధిదారులు రూ.6 వేలు నగదుసాయం అందిస్తుందని వెల్లడించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిదులు కింద ఈ నగదు చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రజలు ఇంకుడు గుంతల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దూళ్ళిపాళ్ళ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి హేమకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతిపై వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరించిన ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు

లక్ష్మీపురం: కూటమి ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్ గోడ పత్రిను శనివారం ఆవిష్కరించారు. ఆయన మట్లాడుతూ నిరుద్యోగ యువతకు నెలకి రూ.3 వేలు చొప్పన భృతి చెల్లిస్తామని నారా చంద్రబాబు చెప్పిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించి 26 జిల్లాల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎన్నికల హామీ మేరకు తక్షణం ఇవ్వాలని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు కమ్యూనిస్టు ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

డ్రగ్స్‌అనర్థాలపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గుంటూరు రూరల్: ఈగల్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఐజీ ఆకె రవికృష్ణ ఆదేశాల మేరకు శనివారం నల్లపాడు పోలీసు స్టేషన్ లిమిట్స్‌లోని చౌడవరం గ్రామం వద్దనున్న బలరామకృష్ణ స్పిన్నింగ్ మిల్స్‌లో కార్మికులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఒడిస్సాకు చెందిన కార్మికులు సుమారు 300 మందికి డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈగల్ టీం విశిష్టత, మాదక ద్రవ్యాల వినియోగం, వాటి దుష్పరిణామాల గురించి కార్మికులకు అవగాహన కల్పించారు. 1972 టోల్ ఫ్రీ నెంబర్ యొక్క ముఖ్య ఉద్దేశం గురించి వివరించారు. మాదకద్రవ్యాలు రవాణా చేసిన, అమ్మిన, కొనిన, సేవించిన, కలిగి ఉన్నా చట్టపరమైన చర్యలు తప్పవని. మాదకద్రవ్య చట్టాలు మరింత కఠినతరం చేయటం జరిగిందని ఈగల్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ సింగయ్య, నల్లపాడు సీఐ వంశీధర్‌లు తెలిపారు. మిల్ యాజమాన్యం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీ కార్యాలయ సూపరింటెండెంట్లుగా సత్యం, రామకృష్ణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం సూపరింటెండెంట్లుగా గుంటూరు మలేరియా ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న డి.సత్యం, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఎస్.రామకృష్ణ శనివారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా శుక్రవారం వీరు ఆర్డీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆర్డీ కార్యాలయంలో సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న షేక్ నాగూర్ షరీఫ్, గుంటూరు మెడికల్ కాలేజ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్ బాపట్ల డీఎంహెచ్ సూపరింటెండెంట్ ఆర్డీ కార్యాలయం నుంచి రిలీవ్ అయి విధుల్లో చేరారు.

అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురకులాల్లో 5వ తరగతి, ఇంటర్ సీట్ల కోసం ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని విద్యార్థులకు, 6, 7, 8, 9 తరగతుల సీట్ల కోసం దరఖాస్తు చేసిన వారికి ప్రవేశ పరీక్ష ద్వారా మరో అవకాశం కల్పించనున్నట్లు అడవి తక్కెళ్లపాడు అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ జి.ఆనందబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన బాలికలకు సత్తెనపల్లి రామకృష్ణాపురంలో, 23వ తేదీన తాడికొండ గురుకుల పాఠశాలలో 5వ తరగతికి ఎంట్రన్స్ రాసి సీటు రాని బాలురు కౌన్సెలింగ్‌కు హాజరైతే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న బాలురు, బాలికల గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లను పొందవచ్చని తెలిపారు. 6,7,8,9, తరగతుల ప్రవేశాలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 25వ తేదీన తాడికొండ అంబేడ్కర్ గురుకులంలో 6,7 తరగతులకు ఉదయం 10 గంటలనుంచి, 8, 9 తరగతులకు, మధ్యాహ్నం రెండు గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు గతంలో ఎంట్రన్స్ రాసి సీటు రాని విద్యార్థులకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గుంటూరు అడవితక్కెళ్ళపాడు అంబేడ్కర్ గురుకులంలో ఈనెల 26వ తేదీన బాలికలకు, 27వ తేదీన బాలురకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని, ఇప్పటికే సీటు రాని విద్యార్థులు ఈ కౌన్సిలింగ్‌కు హాజరైతే ఖాళీగా ఉన్న సీట్లను పొందవచ్చన్నారు.